పారదర్శక పాలనతోనే ప్రజల్లో గుర్తింపు


ఎంపీటీసీలతో ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల


ఎంపీపీ సరోజన-ఆదిరెడ్డి దంపతులను సన్మానిస్తున్న మాజీ ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు-సరోజన దంపతులు

- ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటా
- ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల
- బీఆర్ఎస్ పాలనలో గ్రామస్థాయి ప్రజాప్రతినిధులకు ప్రత్యేక గుర్తింపు
- మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు

మల్లాపూర్, జూన్ 27: ప్రజలకు పారదర్శకమైన పాలన అందించినప్పుడే ప్రజాప్రతినిధులకు తగిన గుర్తింపు వస్తుందని కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కల్వకుంట్ల పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశంతో పాటు ప్రజాప్రతినిధులు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ, అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారంతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతాయని, కొందరు అధికారులు పదవీకాలం ముగిసిన ప్రజాప్రతినిధుల ఫోన్లు ఎత్తడం లేదన్నారు. గ్రామాల్లో ఏమైన సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని చెప్పారు. తన ప్రాణం ఉన్నంత వరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడుతూ, తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ పాలనలోనే దేశంలో ఎక్కడా లేని విధంగా సర్పంచులు, ఎంపీటీసీలకు గౌరవ వేతనం అందించారని, గ్రామాల అభివృద్ధికి పల్లె ప్రగతి పేరిట ప్రత్యేక నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు. అనంతరం ఎంపీటీసీలు, అధికారులు, పాత్రికేయులను సన్మానించి, జ్ఞాపికలు అందజేశారు. అలాగే, ఎంపీపీ కాటిపల్లి సరోజన-ఆదిరెడ్డి దంపతులను మాజీ ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు-సరోజన దంపతులు ప్రత్యేకంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల ఎంపీటీసీలు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు దావ సురేశ్, వైస్ ఎంపీపీ గౌరు నాగేశ్, తహసీల్దార్ వీర్‌సింగ్, ఎంపీడీవో రాజేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఐకేపీ ఏపీఎంలు, మహిళా సంఘాల అధ్యక్షులతో జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

- జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత
- ఐకేపీ ఏపీఎంలు, మహిళా సంఘాల అధ్యక్షులకు సత్కారం

జగిత్యాల, జూన్ 27: మహిళలు స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికాభివృద్ధి సాధించాలని జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత పిలుపునిచ్చారు. పట్టణంలోని జడ్పీ కార్యాలయంలో గురువారం జిల్లాలోని ఆయా మండలాల ఐకేపీ ఏపీఎంలు, మహిళా సంఘాల అధ్యక్షులను ఆమె శాలువాలతో సత్కరించారు. ఈ సందర్భంగా జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత మాట్లాడుతూ, జిల్లాలో మహిళా సంఘాల పనితీరు రాష్ట్రానికే ఆదర్శంగా నిలిచిందన్నారు. ఆర్థిక స్వావలంభన దిశగా బీఆర్ఎస్ ప్రభుత్వం అడుగులు వేసి మహిళా సాధికారతకు కృషి చేసిందన్నారు. మహిళా శక్తిని చాటేందుకు మహిళలంతా అన్ని రంగాల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈవో, ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) రఘువరన్, డీఆర్డీవో సంపత్ రావు, ఏపీఎంలు, మహిళా సంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

భూఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలి

సమావేశానికి హాజరైన పోలీసు అధికారులు

మాట్లాడుతున్న ఎస్పీ అశోక్‌కుమార్

- ఉద్యోగాల పేరిట మోసం చేసే వారిపై చర్యలు తీసుకోవాలి
- ఎస్పీ అశోక్‌కుమార్

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 27: భూఆక్రమణలపై ఉక్కుపాదం మోపాలని ఎస్పీ అశోక్‌కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ ప్రధాన కార్యాలయంలో గురువారం ఆయన పోలీసు అధికారులతో నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, నకిలీ పత్రాలు సృష్టించి భూములు రిజిస్ట్రేషన్ చేసుకునే వారిని, అమాయకులను భయభ్రాంతులకు గురిచేసి ఆక్రమణకు పాల్పడే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. నిరుద్యోగులను ఉద్యోగాల పేరిట మోసం చేసే దళారులు, నకిలీ గల్ఫ్ ఏజెంట్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నకిలీ గల్ఫ్ ఏజెంట్లను గుర్తించి బైండోవర్ చేయాలన్నారు. ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలన్నారు. ఇతర శాఖల అధికారుల సమన్వయంతో రోడ్డు ప్రమాదాలు నివారించాలని సూచించారు. నాన్ బెయిలబుల్ వారెంట్లు జారీ చేసేందుకు కృషి చేయాలన్నారు. దొంగతనాల నివారణకు ప్రతి సర్కిల్ పరిధిలో ఒక స్పెషల్ టీంను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. గంజాయి రవాణా, పేకాట, గుడుంబా, మట్కా, ఇసుక, పీడీఎస్ రైస్ అక్రమ రవాణాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీలు వినోద్‌కుమార్, భీమ్‌రావు, డీఎస్పీలు రవీంద్రకుమార్, రఘుచందర్, ఉమామహేశ్వర్‌రావు, రంగారెడ్డి, డీసీఆర్‌బీ, ఎస్‌బీ, సీసీఎస్, ఐటీ కోర్ ఇన్‌స్పెక్టర్లు శ్రీనివాస్, నాగేశ్వర్‌రావు, లక్ష్మీనారాయణ, రఫీక్‌ఖాన్, సీఐలు వేణుగోపాల్, రాం నర్సింహారెడ్డి, రవి, సురేశ్, నిరంజన్ రెడ్డి, ఎస్ఐలు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కార్యాలయాలను సందర్శించిన కలెక్టర్

కార్యాలయ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ సత్యప్రసాద్

జగిత్యాల, జూన్ 27: జిల్లా కేంద్రంలోని డిస్ట్రిక్ట్ ఆఫీసర్ క్వార్టర్స్, కలెక్టరేట్ పరిసరాలు, ఆర్డీవో కార్యాలయాన్ని గురువారం కలెక్టర్ సత్యప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కలెక్టరేట్ సముదాయానికి ప్రహరీ నిర్మించాలని, సీసీ రోడ్లు అవసరమైతే మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకోవాలని అధికారులకు సూచించారు. కలెక్టరేట్‌లో వాహనాల పార్కింగ్‌కు షెడ్డు ఏర్పాటు చేయాలని ఏవోను ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో ఇన్‌వార్డు రిజిస్టర్లను పరిశీలించారు. భూసేకరణకు సంబంధించిన పనులు ఏ దశలో ఉన్నాయి, జాతీయ రహదారికి సంబంధించిన పూర్తి వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జగిత్యాల ఆర్డీవో శ్రీనివాస్, కలెక్టరేట్ ఏవో హన్మంత రావు, రోడ్లు, భవనాల శాఖ అధికారి శ్రీనివాస్, వివిధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో నిర్మాణాల పరిశీలన

కోరుట్ల, జూన్ 27: పట్టణంలోని కంచరకుంట, మద్దుల చెరువు, తాళ్ల చెరువు పరివాహక ప్రాంతాల్లో ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో ఉన్న నిర్మాణాలను మున్సిపల్, నీటి పారుదల శాఖ అధికారులు గురువారం పరిశీలించారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, కలెక్టర్ ఆదేశాల మేరకు ఆయా ప్రాంతాల్లో నిర్మించిన కట్టడాల వివరాలను సేకరించి నివేదిక అందించనున్నట్లు తెలిపారు. అలాగే, పట్టణంలో పారిశుధ్య పనులను కమిషనర్ పరిశీలించారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో డీఈఈ అభినయ్‌కుమార్, టీపీవో ప్రవీణ్ కుమార్, టీపీఎస్ రమ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, నీటిపారుదల శాఖ డిప్యూటీ ఈఈ తిరుమలకుమార్, వెంకటేశ్ పాల్గొన్నారు.

మద్దుల చెరువు పరివాహక ప్రాంతంలో కట్టడాలను పరిశీలిస్తున్న మున్సిపల్ అధికారులు

చొప్పదండి ఎమ్మెల్యేకు పరామర్శ

ఎమ్మెల్యేను ఓదార్చుతున్న కొండల్‌రావు

కొడిమ్యాల, జూన్ 27: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఇటీవల మృతి చెందారు. కాగా, హైదరాబాద్‌లోని నివాసంలో గురువారం ఎమ్మెల్యేను నాచుపల్లిలోని బృందావన్ రిసార్ట్ అధినేత మర్రిపెల్లి కొండల్‌రావు పరామర్శించారు. రూపాదేవి మృతికి గల కారణాలు అడిగి తెలుసుకొని ప్రగాఢ సానూభూతి తెలిపారు. ఆయన వెంట స్థానిక నాయకులు ఉన్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి

మెట్‌పల్లి రూరల్, జూన్ 27: మెట్‌పల్లి మండలం వెల్లుల్ల గ్రామానికి చెందిన జుంగుల గంగాధర్‌గౌడ్(55) తాటిచెట్టుపై నుంచి పడి మృతిచెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జుంగుల గంగాధర్‌గౌడ్ గీత కార్మిక వృత్తి చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడు. గురువారం ఉదయం తాటిచెట్టు ఎక్కి కల్లు దింపే క్రమంలో నడుముకు గల మోకు జారి కింద పడిపోయాడు. తీవ్ర గాయాలు కాగా, స్థానికులు మెట్‌పల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, చికిత్స పొందుతూ మృతిచెందాడు. గంగాధర్‌గౌడ్‌కు భార్య అంజమ్మ, కుమారుడు, కూతురు ఉన్నారు. కాగా, బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఎంపీపీ మారు సాయిరెడ్డి, గౌడ సంఘం మండలాధ్యక్షుడు జుంగుల మారు తిగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి చెట్లపల్లి సత్యనారాయణగౌడ్, సంఘం నాయకులు చెర్లపల్లి రాజేశ్వర్‌గౌడ్, నర్సాగౌడ్ కోరారు.

నేడు అంజన్న ఆలయంలో ప్రత్యేక పూజలు

మల్యాల, జూన్ 27: కొండగట్టు అంజన్న ఆలయంలో జేష్ఠ మాసాన్ని పురస్కరించుకొని శుక్రవారం అష్టోత్తర శత కళశాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో చంద్రశేఖర్ తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

గొర్రెలు, మేకల సర్వే

జగిత్యాల/జగిత్యాల రూరల్, జూన్ 27: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్, ధర్మారం గ్రామాల్లో గురువారం పశువైద్యాధికారులు గొర్రెల, మేకల సర్వే నిర్వహించారు. వెటర్నరీ అధికారి పూర్ణచందర్, కురుమ, యాదవ కులస్తులు పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్

కేసీఆర్‌తో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, నాయకులు

కథలాపూర్, జూన్ 27: తెలంగాణ తొలి సీఎం కేసీఆర్‌ను మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి గురువారం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రంలో మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం రైతుల సమస్యలను కేసీఆర్ అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట జడ్పీటీసీ భూమయ్య, నాయకులు విజయేందర్‌రెడ్డి, మధురెడ్డి ఉన్నారు.

ఎలాంటి సన్నరకాలు సాగు చేయాలో తెలపాలి

మెట్‌పల్లి రూరల్, జూన్ 27: సన్నరకాల వడ్లు సాగు చేసే రైతులకు బోనస్ చెల్లిస్తామని ప్రభుత్వం పేర్కొంటున్నందున అన్నదాతలు ఎలాంటి సన్నరకాలను పండించాలో వ్యవసాయాధికారులు తెలియజేయాలని మెట్‌పల్లి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అల్లూరి మహేందర్‌రెడ్డి కోరారు. ఈమేరకు గురువారం మెట్‌పల్లి ఏడీఏ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు.

విద్యార్థులకు నోట్ బుక్స్ అందజేత

మల్లాపూర్, జూన్ 27: మండలంలోని హుస్సేన్‌నగర్ ప్రాథమిక పాఠశాలలో సుమారు 135 మంది విద్యార్థులకు నోట్ బుక్స్, ఇతర సామగ్రిని ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్, సభ్యులు నరేశ్, సతీశ్, రవి, సన్ని, రవితేజ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందికి అవగాహన

జగిత్యాల రూరల్, జూన్ 27: పట్టణంలోని కావ్య నర్సింగ్ హోమ్, డయాగ్నోస్టిక్ సెంటర్‌లో గురువారం మెడికల్ సిబ్బంది, నర్సింగ్ స్టాఫ్‌కు మహిళా అభివృద్ధి, శిశుసంక్షేమ కార్యక్రమాలపై జిల్లా మహిళా సాధికారత బృందం సభ్యులు అవగాహన కల్పించారు. డాక్టర్ కనకదుర్గా, మహిళా సాధికారత బృందం సభ్యులు అశ్విని, గౌతమి, స్వప్న, హేమశ్రీ, దవాఖాన సిబ్బంది పాల్గొన్నారు.

కలెక్టర్‌కు వినతి

జగిత్యాల టౌన్, జూన్ 27: ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల్లో సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ సత్యప్రసాద్‌కు తపస్ నాయకులు గురువారం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో తపస్ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి బోయినపెల్లి ప్రసాద్‌రావు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు అయిల్నేని నరేందర్‌రావు, వొడ్నాల రాజశేఖర్, జిల్లా ఆర్థిక కార్యదర్శి గడ్డం మహిపాల్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలి

కథలాపూర్, జూన్ 27: గ్రామాల్లో పారిశుధ్యంపై పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక దృష్టిసారించాలని ఎంపీవో ప్రవీణ్ పేర్కొన్నారు. కథలాపూర్ మండలం ఇప్పపెల్లి, పోతారం గ్రామాల్లో గురువారం ఆయన పర్యటించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శులు శేఖర్, కిషన్ ఉన్నారు.

నీట్ రద్దు చేయాలి

జగిత్యాల టౌన్, జూన్ 27: నీట్ రద్దు చేసి తిరిగి నిర్వహించాలని కలెక్టర్ కార్యాలయ అధికారికి గురువారం తెలంగాణ విద్యా పరిరక్షణ కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో కమిటీ జిల్లా అధ్యక్షుడు చక్రధర్‌రావు, కార్యనిర్వాహక కార్యదర్శి లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి హరగోపాల్ పాల్గొన్నారు.

కలెక్టర్ కార్యాలయంలో వినతి పత్రం ఇస్తున్న తెలంగాణ విద్యా పరిక్షణ కమిటీ సభ్యులు

లయన్స్ క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

ప్రమాణ స్వీకారం చేస్తున్న లయన్స్ క్లబ్ ప్రతినిధులు

కోరుట్ల, జూన్ 26: పట్టణంలోని జీజీఆర్ గార్డెన్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ కోరుట్ల, కోటి నవదుర్గ మహిళా సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకార కార్యక్రం నిర్వహించారు. క్లబ్ జిల్లా మాజీ గవర్నర్ చిదుర సురేశ్ సమక్షంలో అధ్యక్షుడిగా కుందారపు మహేందర్, కార్యదర్శిగా శ్రీగద్దె నరేంద్ర, కోశాధికారిగా కొమ్ముల జగపతి రెడ్డి, మహిళా క్లబ్ అధ్యక్షురాలిగా పోతని శ్రీలత, కార్యదర్శిగా పొలాస గీతారాణి, కోశాధికారిగా మంచాల రోజారమణి ప్రమాణం చేశారు. నూతన కార్యవర్గ సభ్యులకు క్లబ్ సభ్యులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యులు రేకుల విజయ, వాలేటి శ్రీనివాస్ రావు, జయప్రకాశ్, సేగంటి నరేశ్, గొండి వెంకటరమణ, వనపర్తి చంద్రమోహన్, రమ్య, ప్రేమలత, అనంత కృష్ణప్రసాద్, రాధిక, గండ్ర దిలీప్ రావు, పోతని ప్రవీణ్, అల్లాడి శోభ, ఆడెపు కమల, గుంటుక చంద్రప్రకాశ్, అల్లాడి ప్రవీణ్‌కుమార్, ఆడెపు మధు, చాప కిశోర్, ఎలిమిల్ల ఉషాకిరణ్, శ్రీనివాసన్, గుంటుక సురేశ్ బాబు, చాప వందన, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

కోరుట్ల, జూన్ 27: పట్టణంలోని ప్రకాశం రోడ్డు, ఝాన్సీరోడ్డు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయా కాలనీలవాసులు గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. కాలనీవాసులు ఉరుమడ్ల చరణ్, పెంట అశోక్, సతీశ్, శ్రీనివాస్, గంగాధర్, రమేశ్, శంకర్, నరేశ్ పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

కోరుట్ల: మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

గొల్లపల్లి, జూన్ 27: మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని లీడ్ ఇండియా సంస్థ రాష్ట్ర సమన్వయ కర్త తాడూరి శ్రీనివాసచారి పేర్కొన్నారు. గొల్లపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు గురువారం మాదక ద్రవ్యాలతో కలిగే దుష్ప్రభావాలపై అవగాహణ కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాలకు బానిసైతే భవిష్యత్ నశనమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ నగేశ్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోరుట్ల, జూన్ 27: పట్టణంలోని లిటిల్ జీనియస్ హైస్కూల్‌లో డ్రగ్స్ ఫ్రీ ఇండియా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా హెల్త్ ఎడ్యూకేటర్ కటుకం శంకర్ మాట్లాడుతూ, డ్రగ్స్ వాడకంతో కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ బండి మహదేవ్, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, ప్రీ ప్రైమరీ పాఠశాల కరస్పాండెంట్ కొత్త వినోద, ప్రిన్సిపాల్ కటుకం సంధ్యారాణి, ఎన్‌సీసీ ఆఫీసర్ సంగ మహేశ్, తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

కొడిమ్యాల: నాచుపల్లిలో ఓ ఇంట్లో నిల్వ ఉన్న నీటిని పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్

జగిత్యాల రూరల్, జూన్ 27: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ సూచించారు. జగిత్యాల అర్బన్ మండలం దరూర్ గ్రామంలో గురువారం సీజనల్ వ్యాధులపై గ్రామస్తులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజలు ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

కొడిమ్యాల, జూన్ 27: మండలంలోని నాచుపల్లి గ్రామంలో చేపడుతున్న ఇంటింటా జ్వర సర్వేను జిల్లా ఉప వైద్యాధికారి శ్రీనివాస్ పరిశీలించారు. వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. గ్రామంలో అసంపూర్తిగా ఉన్న ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా ఉప వైద్యాధికారి మాట్లాడుతూ, జ్వరం వస్తే వెంటనే పరీక్షలు చేయించుకొని మందులు వాడాలన్నారు. ఇంటి ఆవరణలో వర్షపు నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీపీవో స్వామి, సబ్ యూనిట్ అధికారి శ్రీధర్, వైద్యురాలు పరమేశ్వరి, సీహెచ్‌వో రాజశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

పత్తి సాగుపై అవగాహన

కొడిమ్యాల, జూన్ 27: మండలంలోని నాచుపల్లి గ్రామంలో గురువారం జిల్లా ఏరువాక కేంద్రం కరీంనగర్ ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగుపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక కేంద్రం శాస్త్రవేత్త మదన్‌మోహన్‌రెడ్డి మాట్లాడుతూ, పత్తి మొక్కల మధ్య దూరం పాటిస్తే అధిక దిగుబడి వస్తుందని తెలిపారు. మొక్క 60 నుంచి 70 రోజుల్లో గుబురుగా పెరుగుతుందన్నారు. వరి నారు సంరక్షణలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం జిల్లా వ్యవసాయాధికారి వాణి మాట్లాడుతూ, కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులపై ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించాలన్నారు. రైతులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి జ్యోతి, కృషి విజ్ఞాన కేంద్రం ప్రొఫెసర్ రాజేశ్, ఏఈవోలు శ్రీనివాస్, గ్రీష్మ, రైతులు పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి వాణి

వృద్ధులను విస్మరిస్తే చర్యలు

అవగాహన పత్రాలను ఆవిష్కరిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్, తదితరులు

మెట్‌పల్లి, జూన్ 27:వయోవృద్ధులైన తల్లిదండ్రుల పోషణ, సంరక్షణ బాధ్యత వారసులదేనని, వారిని విస్మరిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మెట్‌పల్లి ఆర్డీవో శ్రీనివాస్ పేర్కొన్నారు. మెట్‌పల్లి సబ్‌కలెక్టర్ కార్యాలయంలో గురువారం వయోవృద్ధుల సంరక్షణ చట్టానికి సంబంధించిన అవగాహన పత్రాలను ఆవిష్కరించారు. అనంతరం వయోధికుల చట్టం కింద పలువురు వయోవృద్ధులు దాఖలు చేసిన వివిధ కేసుల్లో వారి కొడుకులు, కోడళ్లను విచారించి పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మాట్లాడుతూ, వయోవృద్ధులైన తల్లిదండ్రులను పోషించకుండా నిర్లక్ష్యం చేసినా, వేధింపులకు గురి చేసినా బాధిత వృద్ధులు తమకు ఫిర్యాదు చేయాలని కోరారు. కార్యక్రమంలో వయోవృద్ధుల సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి హరి అశోక్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు బుచ్చిరెడ్డి, ప్రధాన కార్యదర్శి సౌదాల కమలాకర్, సురక్ష పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

జగిత్యాల, జూన్ 27: జిల్లా సైన్స్ అధికారి నియామకానికి అర్హత గల సైన్స్ స్కూల్ అసిస్టెంట్లు, ప్రధానోపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాధికారి డాక్టర్ జగన్ మోహన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు జూలై ఒకటో తేదీలోగా జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలని సూచించారు.

విద్యార్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ

మెట్‌పల్లి, జూన్ 27: మెట్‌పల్లి మున్సిపల్ పరిధిలోని రేగుంట ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఫ్రెండ్స్ వెల్ఫేర్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం నోట్ బుక్స్, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టు వ్యవస్థాపక అధ్యక్షుడు సురిగి శ్రీనివాస్, ట్రస్టు సభ్యులు నరేశ్, సతీశ్‌రెడ్డి, రవిరెడ్డి, సన్ని, రవితేజ పాల్గొన్నారు.

మురుగు కాలువలో పడి వ్యక్తి మృతి

మారుతీనగర్, జూన్ 27: మద్యానికి బానిసైన ఓ వ్యక్తి మురుగు కాలువలో పడి మృతి చెందిన ఘటన మెట్‌పల్లి పట్టణంలో బుధవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నిజామాబాద్‌కు చెందిన షేక్ అన్వర్(38) బతుకు దెరువు కోసం మెట్‌పల్లి పట్టణానికి వచ్చాడు. తాగుడుకు బానిస కావడంతో 15 సంవత్సరాల క్రితం భార్య పుట్టింటికి వెళ్లింది. ఈ క్రమంలో అన్వర్ బుధవారం రాత్రి పట్టణంలోని బస్‌డిపో సమీపంలో మురుగు కాలువలో పడి మృతి చెందాడు. గురువారం ఉదయం మున్సిపల్ పారిశుధ్య కార్మికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. అన్వర్ మేనల్లుడు అబ్దుల్ అసద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

సింగారావుపేటలో తాళ్ల చెరువు సర్వే

రాయికల్, జూన్ 27: సింగారావుపేటలో తాళ్లచెరువు ఆక్రమణకు గురవుతున్నదని ఇటిక్యాలకు చెందిన సుంకిశాల సత్తయ్య హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీ ఇచ్చారు. ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి వచ్చిన ఆదేశాల మేరకు జిల్లా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు గురువారం చెరువు స్థలాన్ని సర్వే చేశారు. హద్దులు ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.